

సంక్షేమ పథకాలపై అవగాహన

సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అన్నారు.

8లో



దట్టంగా పొగమంచు

సాక్షి,పాడేరు: జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. బుధవారం పొగమంచు దట్టంగా కురిసింది. చలితీవ్రత తక్కువగానే ఉంది.

14 అడుగుల పుట్ట



హుకుంపేట: మత్స్యపురం పంచాయతీ బంగారుమెట్టలో సుమారు 14 అడుగులకు పైబడి ఎత్తు ఉన్న ఓ పుట్ట ఆకర్షిస్తోంది. సహజంగా 4 అడుగుల ఎత్తు వరకు మాత్రమే పుట్టలు ఉంటాయి.

అభివృద్ధి, సంక్షేమమే విజయానికి సోపానాలు

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం వైఎస్సార్ సీపీదే..
- పార్టీ ముఖ్య నేతల స్పష్టీకరణ
- నామినేషన్ దాఖలు చేసిన పార్టీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్
- వేంకటేశ్వర స్వామి, సంపత్ వినాయక ఆలయల్లో ప్రత్యేక పూజలు
- 5 కి.మీ. మేర వందలాది మంది పార్టీ శ్రేణులతో ర్యాలీ



కలెక్టరేట్ బయట మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రులు బొత్స సత్యనారాయణ, అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు



నామినేషన్ వేస్తున్న వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్, చిత్రంలో టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, ఉప ముఖ్యమంత్రులు ముత్యాలనాయుడు, రాజన్నదొర, మంత్రి బొత్స సత్యనారాయణ

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ గెలుపునకు సోపానాలుగా నిలుస్తాయని టీటీడీ చైర్మన్, పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ మద్దతుతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్ తన నామినేషన్ దాఖలు చేశారు. అంతకుముందు రుషికొండలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, సంపత్ వినాయక ఆలయంలో పూజలు చేశారు. వందలాది వైఎస్సార్ సీపీ శ్రేణులతో ఐదు కిలోమీటర్ల మేర కారు, బైక్‌ల ర్యాలీగా కలెక్టర్ కార్యాలయం చేరుకున్నారు. టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, మంత్రి బొత్స సత్యనారాయణ సమక్షంలో సుధాకర్ నామినేషన్ పత్రాలను కలెక్టర్ మల్లికార్జునకు అందించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ పార్టీలతీతంగా, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు పారదర్శకంగా పాలన అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానాన్ని ఈ ఎన్నికల్లో ఓట్ల రూపంలో చాటుకోవాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే లక్షలాది మంది యువతకు సచివాలయం వ్యవస్థ ద్వారా ఉపాధి కల్పించామన్నారు. యువత భవిష్యత్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు చేపట్టిందన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు ప్రాధాన్యమిస్తున్నారని.. పట్టభద్రులు ఈ విషయాన్ని గుర్తించి పార్టీ అభ్యర్థి విజయానికి సహకరించాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ నాలుగేళ్ల ప్రభుత్వ పాలనను పట్టభద్రులకు వివరించి ఓట్లు అడుగుతామన్నారు. లబ్ధి పొందిన ప్రతీ పట్టభద్రుడు తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

కార్యక్రమంలో మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, వేణుగోపాలకృష్ణ, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ భీశెట్టి సత్యవతి, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పెట్ల ఉమాశంకర్ గణేష్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజు, సమన్వయకర్తలు అక్కరమాని విజయనిర్మల, ఆడారి ఆనంద్, నియోజకవర్గ పరిశీలకులు డి.వి సూర్యనారాయణ రాజు, బొడ్డేడ ప్రసాద్, చిక్కాల రామారావు, రొంగలి జగన్నాథం, డిప్యూటీ మేయర్‌లు జియ్యాని శ్రీధర్, కె.సతీష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజబాబు, కార్పొరేషన్ చైర్మన్లు జాన్‌వెస్లీ, పిల్లా సుజాత, ఫుడ్ కార్పొరేషన్ కమిషన్ సభ్యుడు కాంతారావు, వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు మొల్లి అప్పారావు, శివప్రసాద్, గొలగాని శ్రీనివాస్, ఐహెచ్ పరూఖీ, తుల్లి చంద్రశేఖర్, పేర్ల విజయచందర్, శ్రీదేవివర్మ, కలిదిండి బద్రినాథ్, బోని శివరామకృష్ణ, శ్రీదేవివర్మ, అంగ రాంప్రసాద్, చొక్కర శేఖర్, వార్డు అధ్యక్షులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఒక్క రోజే 12 నామినేషన్లు

- ఇప్పటివరకు దాఖలైన నామినేషన్లు 18
- నేడే చివరి రోజు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు బుధవారం 12 మంది జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు తమ నామినేషన్ పత్రాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్, టీడీపీ మద్దతు అభ్యర్థిగా వేపాడ చిరంజీవిరావు, బీజేపీ మద్దతు అభ్యర్థిగా పి.వి.ఎన్.మాధవ్ నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ రెబల్ అభ్యర్థిగా ఈర్లె శ్రీరామమూర్తి దిగారు.

స్వతంత్ర అభ్యర్థులుగా విజయనగరం జిల్లా రాజాంకి చెందిన పురిపండ శ్రీనివాసరావు, విశాఖ జిల్లా సీబీఎం కాంపౌండ్‌కు చెందిన గుండుపల్లి సతీష్, వేపగుంటకు చెందిన దండేల ఆనందరావు, ఆరిలోవకు చెందిన బలివాడ రామ సంతోష్, మధురవాడకు చెందిన జి.విజయకుమార్, అనకాపల్లి జిల్లా గవరపాలెంకి చెందిన ఆడారి శరత్ చంద్ర, శ్రీకాకుళం జిల్లా సోంపేటకు చెందిన కాళ్ల లోకనాథం, మొలియాపుట్టికి చెందిన రాజానమోహన్‌రావు నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తంగా బుధవారం నాటికి 18 మంది అభ్యర్థులు 27 సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

టీడీపీ ర్యాలీలో కోచింగ్ సెంటర్ విద్యార్థులు

మహారాణిపేట: తెలుగుదేశం మద్దతు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వేపాడ చిరంజీవిరావు నామినేషన్ ర్యాలీని తెలుగుదేశం నాయకులు పెద్దగా పట్టించుకోలేదు. జన సమీకరణకు పెద్దగా ఆసక్తి చూపలేదు. దీంతో అభ్యర్థే చోడవరం నుంచి జనాలను తెప్పించుకున్నారు. ఆయన పని చేస్తున్న కోచింగ్ సెంటర్ నుంచి విద్యార్థులను తీసుకొచ్చారు. వచ్చిన వారితో పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. కలెక్టర్ మల్లికార్జునకు నామినేషన్ పత్రాలు అందించారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల తరఫున గళం వినిపించేందుకు తనకు ఓ అవకాశం ఇవ్వాలని కోరారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, నాయకులు పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రి కొండ్రు మురళీ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

జాడలేని జనసేన

సాక్షి, విశాఖపట్నం: జనసేనతో పొత్తు కొనసాగుతోందని పదేపదే చెప్పుకుంటున్న బీజేపీ నేతలకు జనసేన శ్రేణులు ఝులక్ ఇచ్చాయి. ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీవీఎన్ మాధవ్ నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమంలో జనసేన నాయకులు గాని, కార్యకర్తలు గాని జాడ లేకుండా పోయారు. నామినేషన్ వేసేందుకు పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరే సమయంలో గాని, ర్యాలీలో గాని, కలెక్టరేట్ లోగాని జనసేన నేతలు కనిపించలేదు. జనసేన జెండాలు అగుపించలేదు.

అయితే మాధవ్ మాత్రం ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికలకు జనసేన పార్టీతో కలిసే ముందుకు వెళ్తామని చెప్పడం కొసమెరుపు. బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, ఉపాధ్యక్షుడు పి.విష్ణుకుమార్‌రాజు తదితరులు మాధవ్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.



టీడీపీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు నామినేషన్



బీజేపీ అభ్యర్థిగా పీవీఎన్ మాధవ్ నామినేషన్



టీడీపీ రెబల్ ఈర్లె శ్రీరామ్మూర్తి నామినేషన్

వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షుల నియామకం

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అనుబంధ విభాగ అధ్యక్షులను నియమించారు. బుధవారం ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా యూత్‌వింగ్ అధ్యక్షుడిగా బి.కిరణ్‌కుమార్(అరకు), మహిళా విభాగం– కాపరాజు రుతు(రంపచోడవరం), రైతు విభాగం– దేశగిరి పుష్కరరావు(పాడేరు), బీసీ సెల్ –అదికారి సత్యనారాయణ(రంపచోడవరం), ఎస్సీ సెల్–ఎం.చంద్రశేఖర్ ప్రసాద్(అరకు), ఎస్టీ సెల్– బొబ్బిలి లక్ష్మణ్(పాడేరు), మైనారిటీ సెల్–షేక్ నాగూర్ బాబు, ఐటీ వింగ్–చింతపల్లి దుర్గా రఘునాథ్(రంపచోడవరం), దివ్యాంగుల విభాగం–ముచిక నాగార్జున(రంపచోడవరం), పంచాయతీరాజ్ వింగ్–గబ్బాడ చిట్టిబాబు(పాడేరు), క్రిస్టియన్, మైనారిటీ –ఎం.విజయ కుమార్(అరకు), పబ్లిక్ వింగ్–దోనీ బాపూజీ(పాడేరు), వైఎస్సార్ సేవాదళ్– బొండా అప్పలరాజు(అరకు), కల్చరల్ వింగ్–జి.దిలీప్‌కుమార్(అరకు), వాణిజ్య విభాగం–ఓ.శామ్యూల్(అరకు), వైఎస్సార్‌టీయూసీ–కోటి కోటేశ్వరరావు(రంప చోడవరం), స్టూడెంట్ వింగ్–పిర్ల శ్రీనివాస్(రంపచోడవరం), వీవర్స్ వింగ్–గెద్దం నరసింగరావు(అరకు), గ్రీవెన్స్ సెల్–గొడ్డేటి మహేష్(పాడేరు)లను నియమించారు. జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పార్టీ ప్రతిష్టతకు కృషి చేయాలని, పార్టీ ఎల్లవేళలా వారికి అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి సూచించినట్టు పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వెల్లడించారు. బాధ్యతలు స్వీకరించనున్న నాయకులకు ఆయన అభినందనలు తెలిపారు.

ఓ ఐడియా.. గొంతు తడిపింది

ఎన్ని బోరు బావులు తవ్వినా ఫలితం లేకపోయింది... చుక్క నీరు కూడా రాలేదు... దీంతో చాలా కాలంగా ఆ కాలనీవాసులకు కన్నీటి కష్టాలు తప్పలేదు... అయినా నీటిని అందించే విషయంలో అధికారులు తమ ప్రయత్నాలు విరమించుకోలేదు. ఇంతలో ఓ అధికారికి వచ్చిన ఆలోచన అక్కడి ప్రజలకు పుష్కలంగా నీరు అందేలా చేసింది. వారి దాహార్తి తీర్చింది.

- స్మార్ట్ సోలార్ సిస్టమ్‌తో నీరు తరలింపు
- రూ.3.50 లక్షలతో గడికాలనీ ప్రజలకు మినరల్ వాటర్
- ఫలించిన వెలుగు కన్సల్టెంట్ సత్యనారాయణ ఆలోచన



కుళాయి వద్ద నీరు పడుతున్న గిరిజన మహిళ

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రమైన పాడేరులోని గుడివాడ గడికాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. కాలనీ వాసుల దాహార్తి తీర్చేందుకు గతంలో బోరుబావులు తవ్వారు. ఫలితం లేకపోయింది. ఈ సమస్య పరిష్కారానికి పాడేరు ఐటీడీఏ,వెలుగు శాఖలు సీరియస్‌గా చర్యలు చేపట్టాయి. వెలుగు కన్సల్టెంట్ ఐ.సత్యనారాయణకు ఓ ఐడియా వచ్చింది. పాడేరు ఐటీడీఏ క్వార్టర్స్ వెనుక గతంలో తవ్విన పెద్ద బావిలో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. ఆ నీరు వృథాగా ఉంది. అక్కడ నీటిని దూరంగా ఉన్న గడికాలనీకి తరలించి స్మార్ట్ సోలార్ సిస్టమ్ ద్వారా మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మించాలని నిర్ణయించారు. తక్కువ వ్యయం, ఆధునిక టెక్నాలజీతో నిర్మించే ఈ స్మార్ట్ సోలార్ తాగునీటి పథకానికి ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ మురళీలు కూడా రెండు నెలల క్రితం ఓకే చెప్పారు.దీంతో సత్యనారాయణకు తన కున్న పరిజ్ఞానంతో అతి తక్కువ సమయంలోనే రూ.3.50లక్షల అంచనా వ్యయంతో అధునాతన తాగునీటి పథకాన్ని నిర్మించడంతో గడ్డికాలనీ వాసులకు సురక్షిత తాగునీరు అందుబాటులోకి వచ్చింది.

'హాయ్'గా నీటి సరఫరా..

స్మార్ట్ సోలార్ సిస్టమ్‌తో నిర్మించిన ట్యాంక్‌లలో 5వేల లీటర్ల తాగునీరు నిల్వచేయవచ్చు.పెద్ద బావి నుంచి 700మీటర్ల దూరంలో ఉన్న గడికాలనీలోని ఆరోగ్య ఉప కేంద్రం వరకు పైప్‌లైన్ వేశారు.అక్కడ చిన్న భవనాన్ని నిర్మించారు.భవనంపై మూడు ట్యాంకులు ఏర్పాటు చేశారు. స్మార్ట్ మోటార్ వ్యవస్థకు సిమ్‌ను అమర్చడంతో 'హాయ్' అని మెసేజ్ పెట్టిన వెంటనే మోటార్ వ్యవస్థ ఆన్ అవుతుంది. మోటార్‌ను ఆపివేయాలంటే మళ్లీ 'హాయ్' అని మేసేజ్ పెడితే సరిపోతుంది. సోలార్ వ్యవస్థ కావడంతో విద్యుత్ ఖర్చు కూడా లేదు.సిమ్ కార్డు ద్వారానే ఈ స్మార్ట్ సోలార్ సిస్టమ్ తాగునీటి పథకం పనిచేస్తుంది. కొద్ది రోజుల్లో మినరల్ వాటర్ ప్లాంట్‌ను కూడా అమర్చనున్నారు. 100 నివాసాలకు సురక్షిత తాగునీరు అందించే లక్ష్యంతో ఈ పథకాన్ని నిర్మించారు.మినరల్ వాటర్ ప్లాంట్ సేవలు అందుబాటులోకి వచ్చిన వెంటనే గడికాలనీలోని డ్వాక్రా సంఘానికి ఈ అధునాతన వాటర్ ప్లాంట్ నిర్వహణ బాధ్యతను అప్పగించనున్నారు.



ఐటీడీఏ క్వార్టర్స్ వెనుక బావి



మోటార్ వ్యవస్థ పైన సోలార్ పలకలు



గుడివాడ గడికాలనీలో తాగునీటి పథకం

పక్కాగా విద్యా పథకాల అమలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ జ్యోతి కుమారి

- ఆర్జేడీ జ్యోతి కుమారి

రంపచోడవరం: రాష్ట్ర ప్రభుత్వ విద్యా పథకాలను పక్కాగా అమలు చేయాలని జోన్–1 పాఠశాల ప్రాంతీయ విద్యా సంచాలకులు జ్యోతి కుమారి ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ హాలులో రంపచోడవరం, చింతూరు డివిజన్లకు చెందిన అన్ని యాజమాన్యల ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో ఆమె బుధవారం సమావేశం నిర్వహించారు. శుక్ర, శనివారాల్లో విద్యా శాఖ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఏజెన్సీలో పర్యటించనున్నట్లు చెప్పారు. రికార్డులన్నీ సిద్ధం చేయాలని సూచించారు. 8వ తరగతి విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లను విద్యార్థులు నూరు శాతం వినియోగించాలని, వాటి వినియోగంపై ప్రతీ వారం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. జగనన్న విద్యాకానుకలో అందజేసిన యూనిఫాం, బ్యాగ్‌లు, బూట్లను విద్యార్థులందరూ తప్పనిసరిగా వినియోగించేలా చూసే బాధ్యత ఉపాధ్యాయులదేనని చెప్పారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండాలని, పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండాలని ఆదేశించారు. జగనన్న గోరుముద్ద పథకం మెనూ కచ్చితంగా అమలు చేయాలన్నారు. పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని, యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఇన్‌చార్జి డీడీ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా, సంక్షేమ పథకాలు అన్నింటిని వివరించారు. ఈ సమావేంలో ఎంఈవో సత్యనారాయణదొర, వై.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టేకు వనాల్లో మంటలు



సూరంపాలెం టేకు వనాల్లో అగ్నికి ఆహుతి అవుతున్న చెట్లు

రాజవొమ్మంగి : స్థానిక అటవీ క్షేత్ర కార్యాలయానికి కూతవేటు దూరంలో గల టేకు వనాల్లో బుధవారం రాత్రి మంటలు చెలరేగి చూస్తుండగానే భారీగా విస్తరించాయి. ఉదయానికి ఈ మంటలు మరింత పెరిగి విలువైన టేకు, మారుజాతి చెట్లకు నష్టం కలిగించే అవకాశం ఉంది. అలాగే అడవిలో చెలరేగిన ఈ మంటల వల్ల సమీప కన్నయమ్మపేట, సూరంపాలెం, కొండపల్లి గ్రామాలపై నిప్పురవ్వలు పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండు పుల్లలు, చెట్లపై నుంచి రాలిపడిన ఎండుటాకుల వల్ల సంభవిస్తున్న ఈ అగ్నిప్రమాదాలను సంబంధిత అధికారులు నివారించాలని, ముందస్తు జాగ్రత్తలు పాటించాలని స్థానికులు కోరుతున్నారు.

శిశుమరణాల నివారణకు కృషి

సాక్షి, పాడేరు: జిల్లాలో శిశుమరణాల నివారణకు సచివాలయాల సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్ నుంచి అధికారులు, సచివాలయాల సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50శాతం శిశువులకు వ్యాక్సినేషన్ జరగడం లేదని గుర్తించినట్టు చెప్పారు. వ్యాక్సినేషన్ కార్యక్రమాలు విజయవంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాల పరిధిలో ఆశ,అంగన్‌వాడీ, ఏఎన్‌ఎం,మహిళా పోలీసు తదితర ఏడుగురు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నప్పటికీ శిశు మరణాలు చోటుచేసుకుంటూ ఉండం బాధకరమన్నారు. గ్రామాల్లో నెలకు ఆరేడుకు మించి ప్రసవాలు ఉండవని,ఆయా బాలింతలను ట్రాక్ చేసి తల్లిపాలపై అవగాహన కల్పించడంతో పాటు శిశువులకు వ్యాక్సినేషన్ వేయించేలా చూడాలన్నారు. ప్రతీ సచివాలయంలో బిడ్డ జననతేది, తల్లిదండ్రుల పేర్లు, ఫోన్‌నంబర్లు,వ్యాక్సినేషన్ వివరాలను నమోదుచేయాలన్నారు.హైరిస్క్ గర్భిణులకు సంబంధించిన వివరాలను తప్పక నమోదు చేయాలని తెలిపారు. సచివాలయాల సందర్శనలో ఈ రికార్డులన్నీ తనిఖీ చేస్తానని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలలు,వసతి గృహాల్లో డ్రాపౌట్ వివరాలను నమోదు చేయాలని, తాగునీటి ట్యాంకుల క్లీనింగ్,క్లోరినేషన్ వంటి పనుల రిజిస్టర్‌లను 15 రోజుల్లోగా ప్రారంభించాలన్నారు. గ్రామాల అభివృద్ధిలో సచివాలయాల ఉద్యోగులు భాగస్వామ్యం కావాలని తెలిపారు.డీపీవో కొండలరావు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్

ముఖ ఆధారిత హాజరు బాధ్యత డీడీవోలదే

ఉద్యోగుల ముఖ ఆధారిత హాజరు బాధ్యత ఆయా శాఖల డీడీవోలదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ ఆధారిత హాజరుపై సీఎం కార్యాలయం నుంచి సాధారణ పరిపాలన అధికారి ముత్యాలరాజు, సీఎఫ్‌ఎంఎస్ అధికారి సునీల్ రెడ్డిలు బుధవారం వర్చువల్ విధానంలో కలెక్టర్లతో సమావేశమయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ముఖ ఆధారిత నమోదు అమలుతీరును వివరించారు. ఇంటర్నెట్ కనెక్టివిటీ లేనందున ఎఫ్‌ఆర్‌ఎస్ నమోదు త్వరితగతిన కావడం లేదన్నారు.

న్యూస్‌రీల్

ఆదివాసీల సంక్షేమానికి ప్రత్యేక నిధులు

- ఎన్‌ఎస్‌ఎఫ్‌డీసీ సమావేశంలో కోరిన ఎంపీ మాధవి



సమావేశంలో పాల్గొన్న ఎంపీ మాధవి

కొయ్యూరు: ఆదివాసీల సంక్షేమానికి కేంద్రం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి కోరారు. ఢిల్లీలో బుధవారం నిర్వహించిన జాతీయ షెడ్యూల్డ్ కులాల ఆర్థికాభివృద్ధి సంస్థ(ఎన్‌ఎస్‌ఎఫ్‌డీసీ) సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్పొరేషన్ ద్వారా గిరిజన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సమావేశంలో ప్రస్తావించినట్టు ఆమె విలేకరులకు తెలిపారు.

మన్యంకొండ జాతరకు పటిష్ట భద్రత



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏఎస్పీ మహేశ్వర్‌రెడ్డి

మోతుగూడెం: మన్యంకొండ జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక భద్రత కల్పించాలని ఏఎస్పీ మహేశ్వర్ రెడ్డి ఆదేశించారు. జారత జరిగే పొల్లూరులో బుధవారం ఆయన పర్యటించారు. వనదేవతలు సీలేరు నదిని దాటే ప్రదేశంతో పాటు వనదేవతలకు స్నానాలు చేయించే వాటర్‌ఫాల్స్‌ను సందర్శించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని చింతూరు సీఐ అప్పలనాయుడు, మోతుగూడెం ఎస్‌ఐ సత్తిబాబును ఆదేశించారు. జాతర కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు.

కొల్హాపూర్‌కు దారకొండ భజన బృందం



బాల భక్త భజన బృందం

సీలేరు: మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లా కరివీర్‌లో శ్రీక్షేత్ర సిద్ధగిరి మహా సంస్థాన్‌లో ఈ నెల 20 నుంచి 26 వరకు జాతీయ స్థాయిలో జరిగే సుమంగళం పంచ మహా భూత లోకోత్సవంలో జీకే వీధి మండలం దారకొండ గ్రామానికి చెందిన బాల భక్త భజన బృందం పాల్గొనుంది. ఈ ఉత్సవంలో రోజుకు ఐదు లక్షల మంది భక్తులు, స్వామీజీలు, సాధుసంతులు పాల్గొనున్నారు. ఈ ఉత్సవాల్లో భజన చేయడానికి 20 మంది భక్తులు జిల్లా నుంచి హాజరవుతున్నట్టు జిల్లా సమరసత సేవా ఫౌండేషన్ కన్వీనర్ గొర్లె గణేశ్వరరాజు తెలిపారు.


వ్యాధులు ప్రబలకుండా చర్యలు



మాట్లాడుతున్న కుమార్

చింతపల్లి: గిరిజన గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్.కుమార్ అన్నారు. మండల కేంద్రంలో సచివాలయ ఉద్యోగులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. నవజాతి శిశువులకు 16 వారాల వ్యాక్సినేషన్ చేయాలని తెలిపారు. బడిమానేసిన విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు వెల్ఫేర్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో లాలం సీతయ్య, ఈవో పీఆర్డీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మావోలకు సహకరించొద్దు



విద్యార్థులతో సీఆర్‌పీఎఫ్ సహాయ కమాండెంట్ సచ్చితానంద్‌పాత్ర

గూడెంకొత్తవీధి: గిరిజనులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సీఆర్‌పీఎఫ్ సహాయ కమాండెంట్ సచ్చితానంద్ పాత్ర అన్నారు. సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా కొత్తవలస, తూరుమామిడి, నేరేళ్లబంద గ్రామాల్లో బుధవారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టులకు సహకరించవద్దని సూచించారు. గంజాయి సాగుకు స్వస్తి పలకాలని తెలిపారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు పెన్నులు,పెన్సిళ్లు, రేడియో అందజేశారు.

క్లుప్తంగా

గిరిజనులకు ఉన్నత స్థానంలో అవకాశం కల్పించడం హర్షణీయం



డాక్టర్ కుంభా రవిబాబును కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర దంపతులు, జీసీసీ ఛైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి

ముంచంగిపుట్టు: గవర్నర్ కోటాలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ కుంభా రవిబాబును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిఫార్సు చేయడం అభినందనీయమని ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జీసీసీ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి చెప్పారు. ఈ మేరకు వారు విశాఖపట్నంలోని ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబును మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులకు అత్యున్నత స్థానం కల్పించడం హర్షణీయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు మూర్తి తదితరులున్నారు.

గంజాయి కేసులో పాత నేరస్తుడు అరెస్ట్



అరెస్ట్ చేసిన నిందితుడితో ఎస్‌ఐ సంతోష్

అరకులోయ రూరల్ : గంజాయి రవాణా కేసులో పాత నేరస్తుడు ఒకరిని అరెస్ట్ చేసినట్టు అరకులోయ ఎస్‌ఐ సంతోష్ తెలిపారు, బుధవారం ఆయన మాట్లాడుతూ హుకుంపేట మండలం రంగశీల పంచాయతీ చిట్టివలస గ్రామానికి చెందిన కిల్లో సుబ్బారావు గత ఏడాది 2022లో యండపల్లివలస రైల్వేస్టేషన్‌లో 11 కేజీల గంజాయి తరలిస్తూ కేరళకు చెందిన వ్యక్తితో పాటు పట్టుబడి పరారీలో ఉన్నాడన్నారు. ఎట్టకేలకు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు,

సంక్షేమ పథకాలపై అవగాహన

- ప్రతీ ఇంటిని గృహసారథులు సందర్శించాలి
- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చిత్రంలో ప్రజాప్రతినిధులు

కొయ్యూరు: సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇటు పార్టీకి అటు ప్రజలకు మధ్య వారధిగా పనిచేయాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. రాజేంద్రపాలెంలోని బుధవారం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గృహ సారథులు వారికి కేటాయించి, పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అందిస్తున్న సుపరిపాలనపై విస్తృతంగా తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా గృహ సారథుల విధుల నిర్వహణపై అవగాహన కల్పించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలుచేస్తున్న విధానాలను టీడీపీ కాపీ కొట్టడమే ధ్యేయంగా పనిచేస్తోందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు చేస్తున్న రాజకీయ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని, బుద్ధి చెబుతారన్నారు. టీడీపీని నమ్మే స్థితిలో ఎవరూ లేరన్నారు. నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో కన్వీనర్లు, గృహసారథులను నియమించిన మొదటి మండలం కొయ్యూరన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంగా నిర్దేశించిన 175 సీట్లు కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జె.రాజులమ్మ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్‌నాగమణి, సత్యనారాయణ,మండల ఉపాధ్యక్షులు గజ్జయ్యదొర, వైస్ ఎంపీపీ నూకాలు, సర్పంచ్‌లు సోమన్నదొర, శ్రీను, కన్నయ్య, నాయకులు సూరిబాబు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సాధికారతలో రాష్ట్రం ముందంజ

కొయ్యూరు: సామాజిక సాధికారత సాధనలో దేశంలో మన రాష్ట్రం ముందంజలో ఉందని ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. ఆమె బుధవారం జిల్లా పరిషత్ అతిథిగృహం వద్ద విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలకు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఎక్కువగా ఎమ్మెల్సీ పదవులను ఇచ్చారన్నారు. జగన్‌మోహనరెడ్డిని రెండోసారి సీఎంను చేసేందుకు ఒక సైన్యమే తయారైందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు విజన్ 2020 అంటూ రాష్ట్రాన్ని నాశనం చేశారన్నారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

కొయ్యూరులో అనారోగ్యంతో బుధవారం మరణించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మిడతాన కొండబాబు కుటుంబాన్ని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఎంపీపీ రమేష్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు,కొయ్యూరు ఎంపీటీసీ మల్లికార్జున్,శేఖర్ పాల్గొన్నారు.

పాడి రైతుల ఆదాయం పెంపునకు కృషి



మాట్లాడుతున్న స్మైల్ అడిషనల్ డైరెక్టర్ సింహాచలం

ఆరిలోవ (విశాఖ తూర్పు): పాడి పశువుల ఉత్పాదకత పెంపుదలకు కృషి జరుగుతోందని రాష్ట్ర పశుగణ వ్యవస్థాపకత యాజమాన్య సంస్థ (స్మైల్) అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ యాండ్రపు సింహాచలం తెలిపారు. విమ్స్ సమీపంలోని రాష్ట్ర స్మైల్ కార్యాలయంలో అన్ని జిల్లాలలో ఉన్న వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లకు మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణ బుధవారం ముగిసింది. ఈ శిక్షణలో రోజుకు 35 నుంచి 40 మంది వరకు పశు వైద్యులకు బ్యాచ్‌లవారీగా శిక్షణ ఇచ్చారు. పాడి పశువులకు ఆధునిక పోషణ పద్ధతులు, వాటి ఆరోగ్యం, పాల ఉత్పత్తి పెంచడం, పాడి రైతులకు ఆదాయం పెంచే చర్యలు తదితర అంశాలను అధికారులు వివరించారు. దీంతో పాటు పశు వైద్యులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్మైల్ అదనపు డైరెక్టర్ సింహాచలం మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇంతవరకు ఇక్కడ 1,117 మంది పశు వైద్యులకు, 80 మంది సన్న జీవాల వ్యవస్థాపకులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. విశాఖ, కాకినాడ, గుంటూరు, కర్నూలు, తిరుపతి, అనంతపురం ప్రాంతీయ శిక్షణ కేంద్రాలలో వైద్యులకు, సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిక్షణలో తెలుసుకొన్న అంశాలు, ఆధునిక పద్ధతులను గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులకు అవగాహన కల్పించాలన్నా రు. పాడి రైతులు డెయిరీ ఫారాలు ఏర్పాటు చేసుకోవడానికి, డెయిరీలలో ఎక్కువ సంఖ్యలో పశువులు ఉండే విధంగా ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. పాల ఉత్ప త్తి పెంచే విధంగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రైతులకు ప్రోటీన్‌లతో కూడిన దానా అందించే చర్యలు చేపడుతున్నామన్నారు. ముగింపు కార్యక్రమంలో పశు వైద్యాధికారులు మురళీధర్, చక్రవర్తి, రమణయ్య, సుధాకర్, ప్రసాదరావు, శ్రీనివాసరావు, చంద్రశేఖర్, చలపతిరావు, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

అధిక దిగుబడుల సాధనకు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి నందు

పెదబయలు: జిల్లాలో రైతులు వ్యవసాయ, ఉద్యానవన పంటల్లో అధిక దిగుబడులు సాధించడానికి గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.బి.ఎస్.నందు తెలిపారు. పెదబయలు,ముంచంగిపుట్టు మండలాల వ్యవసాయ,ఉద్యానవన శాఖల సిబ్బందికి స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాఫీ, మిరియాలు, పసుపు సాగులో అధిక దిగుబడులు సాధించడంలో రైతులకు అవగాహన కల్పించేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. గ్రామ సచివాలయం పరిధిలో ఎంత మంది రైతులు ఏయే పంటలు పండిస్తున్నారన్న దానిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించడంతో పాటు వారికి సహకారం అందించాలని సూచించారు. ఆర్బీకేల ద్వారా అందిస్తున్న సేవలను ప్రతీ రైతు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో విగ్గిన్స్, సీనియర్ ఫీల్డ్ అధికారులు కల్యాణి,కుమారి,పెదబయలు, ముంచంగిపుట్టు మండల వ్యవసాయ అధికారులు శ్రీనివాస్,మోహన్, హార్టీకల్చర్ అధికారులు జ్యోత్స్నరాణి, పద్మ, కాఫీ బోర్డు అధికారి రాములు పాల్గొన్నారు.

ఇగ్నోలో ప్రవేశాల గడువు 28 వరకు పొడిగింపు

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2023 జనవరి విద్యాసంవత్సరానికి గాను ప్రవేశాల గడువు ఈ నెల 28 వరకు పొడిగించినట్లు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కేంద్రం పరిధిలోని 5 జిల్లాల విద్యార్థులకు ఆన్‌లైన్ విధానంలో ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. https://ignouadmission.samarth.edu.in/ వెబ్‌సైట్ ద్వా రా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ప్రత్యామ్నాయ స్కూళ్లకు ప్రతిపాదనలు

- పాడేరు డీడీ కొండలరావు

కొయ్యూరు: పిల్లలు ఎక్కువగా ఉండి, పాఠశాలలు లేని గ్రామాలను గుర్తించి ప్రత్యామ్నాయ బడులు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదిస్తున్నట్టు పాడేరు గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు తెలిపారు. చాలా గ్రామాల్లో పిల్లలున్నా పాఠశాలలు లేవని, విద్యార్థుల సంఖ్య 15 మించి ఉంటే అక్కడ ప్రత్యామ్నాయ పాఠశాల ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాజేంద్రపాలెంలో బాలికల పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్ల ద్వారా సర్వే చేయించి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. చీడికోట,పలకజీడి జీపీఎస్ టీడబ్ల్యూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆరులోపు ఉందన్నారు.అలాంటి చోట్ల ఉపాధ్యాయుడిని నియమించడం ఇబ్బందిగా ఉంటుందన్నారు.అలా అని పాఠశాలను మూసివేయలేమని చెప్పారు.

పక్కాగా 57 రోజుల ప్రణాళిక

పదో తరగతి విద్యార్థులకు 57 రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకునేందుకు రోజుకో సబ్జెక్ట్‌పై పరీక్ష నిర్వహించాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో వందకు పైగా ఖాళీగా ఉన్న కుక్,కమాటీ పోస్టుల భర్తీకి ఉన్నతాధికారులకు నివేదించామని చెప్పారు. ఎం.భీమవరం, పలకజీడి, యూ.చీడిపాలెం ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని, ఆ సంఖ్యను పెంచేందుకు గ్రామస్తులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎం.భీమవరం పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.30 వేలు మంజూరు చేస్తామని తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల ఆస్తులివే..

మహారాణిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు స్థిర, చర ఆస్తులు, కేసులు, రుణాల వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించారు.

- వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ తన పేరిట చరాస్తి రూ.23.58 కోట్లు, తన భార్య పేరిట రూ.87.21 లక్షలు, స్థిరాస్తి తన పేరిట రూ.22.41 కోట్లు, తన భార్య పేరున రూ.29.85 కోట్లు ఉన్నట్టు పేర్కొన్నారు. రుణాలు తన పేరున రూ.4.63 కోట్లు, భార్య పేరిట రూ.1.05 కోట్లు ఉన్నట్లు వెల్లడించారు. పోలీస్‌స్టేషన్లలో ఎక్కడా కేసులు నమోదు కాలేదని అఫిడవిట్‌లో పేర్కొన్నారు.
- తెలుగుదేశం మద్దతు అభ్యర్థి డాక్టర్ వేపాడ చిరంజీవిరావు తన పేరున చరాస్తి రూ.34.93 లక్షలు, తన భార్య పేరున రూ.87.84 లక్షలు, స్థిరాస్తి తన పేరున రూ.2.41కోట్లు, భార్య పేరున రూ.2.47కోట్లు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. రుణాలు తన పేరిట రూ.89 లక్షలు, భార్య పేరున రూ.8.03 లక్షలు ఉన్నట్టు వెల్లడించారు. ఎటువంటి నేర చరిత్ర లేదని, కేసులు కూడా నమోదు కాలేదని తెలిపారు.
- బీజేపీ మద్దతు అభ్యర్థి పి.వి.ఎన్ మాధవ్ నగదు రూపంలో రూ.50 వేలు, భార్య వద్ద రూ.25 వేలు, తన పేరున 10 గ్రాముల బంగారం, భార్య పేరున 100 గ్రాముల బంగారం, స్థిర, చర ఆస్తులు కలిపి రూ.3.42 కోట్లు, రూ.18 లక్షల అప్పులు ఉన్నట్లు వెల్లడించారు. పలు పోలీసు స్టేషన్లలో మూడు కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు.

నూడిల్స్ దుకాణం దగ్ధం



అగ్నికి ఆహుతైన సామగ్రి

సాక్షి,పాడేరు : స్థానిక ఎక్సైజ్ స్టేషన్ సమీపంలోని న్యూడిల్స్ దుకాణం నడిపే బడ్డీ విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో అగ్నికి దహనమైంది. మంగళవారం అర్ధరాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కొత్తల దేవా అనే వ్యాపారి బడ్డీని అద్దెకు తీసుకుని న్యూడిల్స్ వ్యాపారం చేస్తున్నాడు. మంగళవారం రాత్రి 10.30 గంటల సమయంలో దుకాణం మూసి ఇంటికి వెళ్లాడు. ఈ తరువాత బడ్డీకి మంటలు వ్యాపించడంతో స్థానికులంతా ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో మంటలను ఆపే ప్రయత్నం చేశారు. అప్పటికే బడ్డీలోని విలువైన సామాగ్రి అంతా అగ్నికి ఆహుతైంది. గ్యాస్ సిలిండర్ ఒక్కసారిగా ఉబ్బడంతో స్థానికులు ఆందోళన చెందారు. సమాచారం అందుకున్న ఫైర్ ఇంజిన్ సిబ్బంది సిలిండర్‌ను బయటకు తీసి అందులోని గ్యాస్‌ను తీసేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు దేవా వాపోయాడు.

జిల్లా ఆస్పత్రిలో గర్భిణులు,బాలింతలకు పూర్తిస్థాయి సౌకర్యాలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ జమల్‌బాషా




జిల్లా ఆస్పత్రిని సందర్శిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జమల్‌బాషా

పాడేరు రూరల్ : ప్రసవం కోసం పాడేరు జిల్లా ఆస్పత్రికి వచ్చే గర్భిణులు, ప్రసవం తర్వాత బాలింతలకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలని, వారికి అందిస్తున్న వైద్యసేవలపై నిరంతర పర్యవేక్షణ చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జమల్‌బాషా అన్నారు. బుధవారం పాడేరు జిల్లా ఆస్పత్రి గైనిక్ విభాగాన్ని తనిఖీ ఆయన చేశారు. జిల్లా ఆస్పత్రిలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్‌ను పరిశీలించారు. గర్భిణులకు వైద్య పరీక్షలు అందజేస్తున్న ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు, జిల్లా ఆస్పత్రి గైనికాలజిస్ట్ డాక్టర్ తమర్భ నర్సింగరావుతో సమావేశమయ్యారు. మాతాశిశు మరణాల నివారణపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆస్పత్రి సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట ఏడీఎంహెచ్‌వో డాక్టర్ కె.లీలాప్రసాద్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.కృష్ణారావు, తదితరులు ఉన్నారు.

చోరీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

వీఆర్‌పురం : ఇటీవల పలు గ్రామాల్లో చోరీలకు పాల్పడిన ముగ్గురు నిందితులను గుర్తించి అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ టి.దుర్గాప్రసాద్ బుధవారం తెలిపారు. రేఖపల్లి, వడ్డిగూడెం కాలనీ, సీతంపేట తదితర గ్రామాల్లో వరుస చోరీలు జరిగి విలువైన బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని ఎస్‌ఐ చెప్పారు. విచారణలో రేఖపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఈ చోరీలకు పాల్పడినట్టు తేలిందన్నారు. నిందితుల నుంచి 40 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకొని వారిని రంపచోడవరం కోర్టుకు తరలించడం జరిగిందన్నారు. కాగా చోరీ ఆభరణాలను విక్రయించడంలో కీలక పాత్ర పోషించిన మరో వ్యక్తిని విడిచి, ముగ్గురిని మాత్రమే పోలీసులు దోషులుగా చూపారని మండలంలో ప్రచారం జోరుగా సాగుతుంది. ఎస్‌ఐ దుర్గాప్రసాద్‌ని దీనిపై వివరణ కోరగా దోషులు ముగ్గురేనని వారిని రిమాండ్‌కు తరలించడం జరిగిందని చెప్పారు.

ఏరియా ఆస్పత్రికి గర్భిణి తరలింపు



స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణి

చింతపల్లి: స్థానిక గర్భిణుల వసతి గృహం నుంచి స్వగ్రామానికి రహస్యంగా తరలివెళ్లిపోయిన మహిళను తిరిగి చింతపల్లి ఏరియా ఆస్పత్రికి బుధవారం తరలించారు. గూడెంకొత్తవీధి మండలం ధారకొండ పీహెచ్‌సీ పరిధిలోని కొంగపాకలుకు చెందిన పల్లరెడ్డి లక్ష్మి మూడవ కాన్పు కోసం ఈ నెల 5న పీహెచ్‌సీలో చేరింది. వైద్యాధికారి హిమబిందు పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడంతో ఏరియా ఆస్పత్రికి ఆమెను తరలించారు. ఈ నేపథ్యంలో ఆమె ఈనెల 7న ఆస్పత్రి సిబ్బందికి చెప్పకుండా ఇంటికి వెళ్లిపోవడంతో 9న వైద్య సిబ్బంది ఆమె ఇంటికి వెళ్లి బలవంతంగా ఆమెను ధారకొండ పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. అయితే ప్రసవ సమయం దగ్గర పడడంతో ఆమెను మంగళవారం చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సేవలందిస్తున్నారు.